

మాట మార్చడం సమంజసం కాదు..

కాంగ్రెస్ పార్టీ రైతు భరోసాపై మాట మార్చడాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ నేతలు మంగళవారం ఆందోళనలు చేశారు.

- 9లో ▸



బీసీ డిక్లరేషన్ అమలు చేయాలి

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు బీసీ డిక్లరేషన్ అమలు చేయాలని బీజేపీ నేతలు డిమాండ్ చేశారు.

- 9లో ▸

గరిష్టం/కనిష్టం 28.9 /11.5

వాతావరణం

ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి మంచు కురుస్తుంది. చలి తీవ్రత కొనసాగుతుంది.

న్యూస్‌రీల్

‘కేసులకు దూరంగా ఉండాలి’



కామారెడ్డి క్రైం : అసిస్టెంట్ ఎస్పీ చైతన్యరెడ్డి మంగళవారం పట్టణ పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. పరిసరాలు, రికార్డులను పరిశీలించి పలు సూచనలు ఇచ్చారు. అనంతరం సస్పెక్ట్ షీట్ కలిగిన వ్యక్తులకు స్టేషన్ ఆవరణలో కౌన్సెలింగ్ ఇచ్చారు. వివాదాలు, కేసులకు దూరంగా ఉండాలని సూచించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో పట్టణ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్‌రెడ్డి ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

‘యోగా, ధ్యానంతో జీవన విధానంలో మార్పు’



కామారెడ్డి అర్బన్: యోగా, ధ్యానం ద్వారా మనిషి జీవన విధానంలో మంచి మార్పు వస్తుందని స్వామి బ్రహ్మానంద సరస్వతి అన్నారు. కామారెడ్డి పట్టణ పరిధిలోని పాతరాజంపేట ఆర్ష గురుకులంలో వారం రోజుల యోగా సాధన శిబిరం కార్యక్రమంలో స్వామి బ్రహ్మానంద సరస్వతి పాల్గొన్నారు. ఈ నెల 12 వరకు నిర్వహించే ఈ శిబిరంలో యోగ దర్శనం, సంస్కృత పరిచయం, ఆహార, ఆరోగ్య నియమాలు, ధర్మార్థ కామ మోక్షాలు, ఉదయం, సాయంకాల యజ్ఞం తదితర అంశాలపై శిక్షణ ఇస్తున్నామన్నారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి



బాన్సువాడ రూరల్: వాహనదారులు రోడ్డు భద్రత నియమాలు పాటించాలని జిల్లా రవాణా శాఖ అధికారి శ్రీనివాస్ సూచించారు. మంగళవారం జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలను ప్రారంభించిన అనంతరం బాన్సువాడలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ద్విచక్రవాహనాలు నడిపే వారు కచ్చితంగా హెల్మెట్ ధరించాలన్నారు. ట్రాఫిక్ రూల్స్‌ను తప్పకుండా పాటించాలన్నారు. సమావేశంలో ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్, మున్సిపల్ చైర్మన్ గంగాధర్, ఇంటర్ నోడల్ ఆఫీసర్ షేక్ సలాం తదితరులు పాల్గొన్నారు.

‘నర్సరీల నిర్వహణలో జాగ్రత్తలు పాటించాలి’



లింగంపేట: నర్సరీల నిర్వహణలో జాగ్రత్తలు పాటించాలని జిల్లా పరిషత్ సీఈవో చందర్‌నాయక్ సూచించారు. మంగళవారం ఆయన నల్లమడుగు శివారులోని నర్సరీని పరిశీలించారు. నర్సరీలను కార్యదర్శులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. డంపింగ్‌యార్డు, వర్మి కంపోస్టు ఎరువుల తయారీ కేంద్రాలను పరిశీలించారు. అన్ని గ్రామ పంచాయతీలు డంపింగ్ యార్డుల్లో వర్మి కంపోస్టు ఎరువులు తయారు చేసి, ఆదాయాన్ని పెంచుకోవాలని సూచించారు. ఆయన వెంట ఎంపీడీవో నరేశ్, ఏపీఎం శ్రీనివాస్ తదితరులున్నారు.

‘విద్యుత్ సమస్య తలెత్తకుండా చర్యలు’



కామారెడ్డి టౌన్: జిల్లాకేంద్రంలో విద్యుత్ సమస్యలు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని ట్రాన్స్‌కో డివిజన్ ఇంజినీర్ కల్యాణ్ చక్రవర్తి తెలిపారు. జిల్లా కేంద్రంలోని గడి వాటర్ ట్యాంక్ వద్ద ట్రాన్స్‌ఫార్మర్ సమస్య ఉండడంతో మంగళవారం అధికారులతో కలిసి సందర్శించారు. ప్రత్యేక ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరగా త్వరలో ఏర్పాటు చేస్తామని డీఈ హామీ ఇచ్చారు. ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు జరిపించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు కన్నయ్య, వేణు, ఏడీ కిరణ్ చైతన్య, ఏఈ రంజిత్ కుమార్, లైన్‌మన్ స్వామి పాల్గొన్నారు.

రైతుల శ్రేయస్సు కోసం పనిచేయాలి



కామారెడ్డిలో మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు, వేదికపై ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఎంపీ సురేశ్ షెట్కార్

- మంత్రి జూపల్లి కృష్ణారావు
- ఏఎంసీ పాలకవర్గం ప్రమాణ స్వీకారం

కామారెడ్డి రూరల్ : నూతన పాలకవర్గ సభ్యులు మార్కెట్ కమిటీకి ఆదాయం వచ్చేలా చూస్తూనే రైతుల శ్రేయస్సు కోసం కష్టపడాలని ఎక్సైజ్, టూరిజం శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు సూచించారు. మంగళవారం కామారెడ్డి గాంధీగంజ్‌లోని మార్కెట్ కమిటీ ఆవరణలో మార్కెట్ కమిటీ ప్రమాణస్వీకార కార్యక్రమం నిర్వహించారు. పాలకవర్గంతో మంత్రి ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదవులు అలంకారప్రాయం కావద్దన్నారు. రైతుల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. హనుమకొండ జిల్లాలోని ముల్కనూర్ సొసైటీని పాలకవర్గం సందర్శించాలని, అక్కడి విధానాలను అధ్యయనం చేసి ఇక్కడ అమలు చేసేందుకు కృషి చేయాలని సూచించారు.

ప్రభుత్వాన్ని విమర్శించే హక్కులేదు..

ప్రభుత్వాన్ని విమర్శించే నైతిక హక్కు బీఆర్ఎస్‌కు లేదని మంత్రి పేర్కొన్నారు. రాష్ట్రాన్ని అప్పులపాలు చేసిన ఘనత గత ప్రభుత్వానిదేనన్నారు. ఆర్థిక పరిస్థితి దుర్భరంగా ఉన్నా ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకుంటున్నామని పేర్కొన్నారు. కామారెడ్డి పెద్ద చెరువును పర్యాటకంగా అభివృద్ధి చేస్తానన్నారు. విద్యార్థుల్లో నైపుణ్యం పెంపొందించడం కోసం రూ. 50 లక్షలు మంజూరు చేస్తానని తెలిపారు.

కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ, మార్కెట్ కమిటీ చైర్మన్ ధర్మగోని లక్ష్మీరాజాగౌడ్, వైస్ చైర్మన్ బ్రహ్మానందరెడ్డి, కాంగ్రెస్ నాయకులు పండ్ల రాజు, పున్న రాజేశ్వర్, ఎడ్ల రాజిరెడ్డి, గూడెం శ్రీనివాస్‌రెడ్డి, బద్దం ఇంద్రకరణ్‌రెడ్డి, నిమ్మ మోహన్‌రెడ్డి, తిర్మల్‌గౌడ్, అశోక్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, విజయ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్‌కు చెంపపెట్టు

ఏసీబీ కేసులో కేటీఆర్ వేసిన క్వాష్ పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేయడం ఆయనకు చెంపపెట్టు అని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ అన్నారు. ఈనెల 26 నుంచి కొత్త రేషన్ కార్డులు ఇస్తామని, ఇల్లు లేని వారందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని పేర్కొన్నారు. కామారెడ్డి మార్కెట్ కమిటీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఎంపీ సురేశ్ షెట్కార్ హామీ ఇచ్చారు.



కామారెడ్డి ఏఎంసీ పాలకవర్గంతో ప్రమాణస్వీకారం చేయిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

ఇచ్చిన మాట నిలబెట్టుకుంటున్నాం

బాన్సువాడ : రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేకున్నా రైతులకు ఇచ్చిన మాట ప్రకారం రైతు భరోసా ఇస్తున్నామని జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. మంగళవారం బాన్సువాడకు వచ్చిన ఆయన.. రోడ్డు భద్రత మాసోత్సవ ర్యాలీని ప్రారంభించారు. పట్టణంలో రూ. 40 లక్షలతో నిర్మించిన ప్రొహిబిషన్, ఎక్సైజ్ కార్యాలయ భవనాన్ని ప్రారంభించారు. మున్సిపల్ కార్యాలయం వద్ద రూ. 52 కోట్లతో చేపట్టిన అమృత్ 2.0 పథకానికి శంకుస్థాపన చేశారు. అనంతరం బల్దియా వద్ద ఏర్పాటు చేసిన సభలో మాట్లాడారు. భవిష్యత్‌లో తాగు, సాగు నీటికి ఎలాంటి ఇబ్బందులు ఏర్పడకుండా శాశ్వత పరిష్కారం కోసం ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి రూ. 52 కోట్లతో అమృత్ 2.0 పథకం మంజూరు చేయించారన్నారు. ఇల్లు లేని పేదలందరికీ ఇందిరమ్మ పథకం కింద ఇళ్లను మంజూరు చేసి రూ. 5 లక్షలు ఇస్తామని పేర్కొన్నారు. మొదటి విడతలో నియోజకవర్గానికి 3,500 ఇళ్లను మంజూరు చేశామన్నారు. రైతు భరోసా కింద ఏడాదికి ఎకరానికి రూ. 12 వేల చొప్పున ఇవ్వాలని నిర్ణయించామని, దీనిపై మాజీ మంత్రి కేటీఆర్ తన సొంత పత్రికలో అబద్ధాలతో రాద్ధాంతం చేయిస్తున్నారని విమర్శించారు. ధనిక రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిన ఘనత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. కలలో కూడా బీఆర్ఎస్ అధికారంలోకి రాదన్నారు. రోజూ గంట సమయాన్ని ఆరోగ్యం కోసం కేటాయిస్తే నిండునూరేళ్లు జీవిస్తామని, ప్రజలు దీన్ని గమనించి ఆరోగ్యంగా ఉండాలని సూచించారు. కామారెడ్డితో పాటు బాన్సువాడను ఆదర్శంగా తీర్చిదిద్దుతామని ఎంపీ సురేశ్ షెట్కార్ పేర్కొన్నారు.



అమృత్ 2.0 పథకానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి జూపల్లి, పోచారం, షెట్కార్

తాగునీటి సమస్య లేకుండా..

భవిష్యత్‌లో మంచినీటి సమస్య ఉండకుండా శాశ్వత పరిష్కారం కోసం అమృత్ 2.0 పథకం మంజూరు చేయించామని ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. రెండేళ్లలో పనులు పూర్తవుతాయని, రాబోయే 50 ఏళ్లు మంచి నీటి కొరత ఉండదని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్, జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు, కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, సబ్ కలెక్టర్ కిరణ్మయి, మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్, డీసీసీబీ మాజీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి, నాయకులు పోచారం సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రోడ్డు భద్రత వారోత్సవాలను ప్రారంభిస్తున్న మంత్రి, ఎమ్మెల్యే, ఎంపీ, కలెక్టర్

25లోగా సీఎంఆర్ పూర్తి చేయాలి



మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, పక్కన అదనపు కలెక్టర్ విక్టర్, సివిల్ సప్లయ్ కార్పొరేషన్ డీఎం రాజేందర్, డీఎస్‌వో మల్లికార్జున్ బాబు

- గడువు దాటితే చర్యలు తప్పవు
- రైస్ మిల్లర్లతో కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి క్రైం: గతేడాది రబీ సీజన్‌కు సంబంధించిన కస్టం మిల్లింగ్ రైస్ (సీఎంఆర్)ను ఈనెల 25వ తేదీలోగా అందించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. లేకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. మంగళవారం జిల్లాలోని రైస్ మిల్లర్లతో కలెక్టరేట్‌లో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతేడాది రబీలో సేకరించిన ధాన్యాన్ని లక్ష్యానికి అనుగుణంగా మిల్లింగ్ చేసి సరఫరా చేయలేదన్నారు. నిర్ణీత గడువులోగా సీఎంఆర్ పూర్తయ్యేలా చూడాలన్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు అన్ని రైస్‌మిల్లులను తనిఖీ చేసి బియ్యం నిల్వలను పరిశీలించాలని ఆదేశించారు. గత ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన సీఎంఆర్‌పై అధికారులను వాకబు చేశారు. త్వరగా సీఎంఆర్ పూర్తి చేసి, జిల్లాను ప్రథమ స్థానంలో నిలిపేందుకు మిల్లర్లు సహకరించాలన్నారు. సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ వి.విక్టర్, సివిల్ సప్లయ్ కార్పొరేషన్ డీఎం రాజేందర్, డీఎస్‌వో మల్లికార్జున్ బాబు, అధికారులు, రైస్ మిల్లర్లు పాల్గొన్నారు.

‘సమగ్ర’ సమ్మె విరమణ

కామారెడ్డి టౌన్: డిమాండ్ల సాధన కోసం సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు చేపట్టిన నిరవధిక సమ్మెను విరమించారు. మంగళవారం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో జరిగిన చర్చలు సఫలం కావడంతో ఈ నిర్ణయం తీసుకున్నామని సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ తెలిపారు. సమ్మె విరమణ పత్రాన్ని డీఈవో ఎస్.రాజుకు అందజేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ పేస్కేల్ అమలు చేయడానికి ప్రభుత్వం మూడు నెలల గడువు తీసుకుందని, మిగతా ఆర్థికేతర అంశాలన్నీ పరిష్కరిస్తామని, సమ్మె కాలపు వేతనాన్ని చెల్లిస్తామని ఉప ముఖ్యమంత్రి హామీ ఇచ్చారని పేర్కొన్నారు. దీంతో తాత్కాలికంగా సమ్మె విరమిస్తున్నామన్నారు. సమ్మెకు మద్దతు తెలిపిన ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాలు, వివిధ సంఘాల ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సంపత్, మహిళా అధ్యక్షురాలు వాసంతి, ప్రతినిధులు రాములు, సంతోష్‌రెడ్డి, శైలజ, వనజ, శ్రీవాణి, కాళిదాస్, కల్యాణ్, సంధ్యారాణి, సాయిలు, గంగప్రసాద్, శంకర్, దినేష్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



డీఈవో రాజుకు సమ్మె విరమణ పత్రాన్ని అందజేస్తున్న ఉద్యోగులు

సివిల్ సప్లయ్ హమాలీలు..

కామారెడ్డి టౌన్: సమస్యల పరిష్కారం కోసం సివిల్ సప్లయ్ హమాలీలు వారం రోజులుగా చేస్తున్న సమ్మెను మంగళవారం విరమించారు. పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో జరిగిన చర్చలు సఫలం అయ్యాయని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు బాల్‌రాజు తెలిపారు. సివిల్ సప్లయ్ హమాలీలకు ఎగుమతి, దిగుమతి కూలీ రేటు పెంపు జీవోను త్వరలో విడుదల చేసి అమలు చేస్తామని మంత్రి హామీ ఇవ్వడంతో సమ్మెను విరమించామన్నారు.

ఐదేళ్లయినా పునరావాసం లేదు

- భూమి కోసం కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు
- మాజీ మావోయిస్టు క్యాతం శ్రీనివాస్ ఆవేదన

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : ప్రభుత్వానికి లొంగిపోతే పునరావాసం కల్పిస్తామని ప్రభుత్వాలు చెప్పడమే తప్ప వారిని ఆదుకోవడం లేదు. తమకు ఇస్తామన్న భూమి కోసం ఏళ్ల తరబడి అధికారుల చుట్టూ తిరిగి వేసారుతున్నారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలోని దేవునిపల్లికి చెందిన క్యాతం శ్రీనివాస్ అలియాస్ సమీర్ సీపీఐ మావోయిస్టు పార్టీలో మూడు దశాబ్దాలకుపైగా పనిచేశారు. ఆ పార్టీలో నార్త్ రీజియన్ బ్యూరో మెంబర్‌గా పనిచేసి 2019 డిసెంబర్ 24 న లొంగిపోయారు. లొంగిపోయిన నక్సలైట్లకు ప్రభుత్వం ఐదెకరాల భూమి, ఇంటి స్థలం ఇవ్వాలన్న ఆదేశాలున్నాయి. క్యాతం శ్రీనివాస్ తనకు ఎలాంటి ఉపాధి లేదని, పునరావాస పథకంలో భాగంగా వ్యవసాయ భూమి ఇవ్వాలని అప్పటి కలెక్టర్‌కు దరఖాస్తు చేసుకున్నారు. పరిశీలించిన అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. శ్రీనివాస్‌కు సంబంధించిన ఫైల్ ఇప్పటికీ సీసీఎల్‌ఏలో పెండింగ్‌లో ఉంది. పునరావాసం విషయమై ప్రజావాణిలోనూ పలుమార్లు దరఖాస్తు చేసుకున్నారు. అయినా పని జరగడం లేదు. ఐదేళ్లుగా అధికారుల చుట్టూ తిరుగుతున్నానని శ్రీనివాస్ ‘సాక్షి’తో ఆవేదన వ్యక్తం చేశారు. తనకు ఎలాంటి ఆస్తిపాసులు లేవని, ప్రభుత్వం భూమి చూపిస్తే వ్యవసాయం చేసుకుని జీవనం సాగిస్తానని పేర్కొంటున్నారు. కలెక్టర్, ఎస్పీ చొరవ చూపి సీసీఎల్‌ఏలో పెండింగ్‌లో ఉన్న తన ఫైల్‌ను క్లియర్ చేయించాలని కోరుతున్నారు.



క్యాతం శ్రీనివాస్

‘స్థానికం’లో గెలుపే లక్ష్యం కావాలి

- పదవులు రాలేదని నిరాశ చెందొద్దు
- పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్

డిచ్‌పల్లి: స్థానిక సంస్థల ఎన్నికలలో గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. మంగళవారం డిచ్‌పల్లిలో జరిగిన నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యకర్తలలో కొద్దిగా నిరాశ ఉందన్నారు. పదేళ్ల ఎన్నో కష్టానష్టాలకు ఓర్చి పార్టీ జెండా మోసిన కార్యకర్తలను ఆదుకునే సమయం ఇదేనన్నారు. మాకు పదవులు వచ్చాయన్నా.. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నా అదంతా కార్యకర్తల కృషి వల్లేనన్నారు. పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా పదవులు రాలేదని నిరాశకు గురికావద్దని, స్థానిక సమరం మీదేనని, ఓపికగా ఉండాలని సూచించారు. విభేదాలను వీడి, అందరినీ కలుపుకుని వెళ్లాలని నాయకులకు సూచించారు. ఫార్ములా – ఈ కార్ రేస్‌లో అడ్డంగా దొరికిన దొంగ కేటీఆర్ అన్నారు. పదేళ్ల తర్వాత బీసీలపై ప్రేమ నటిస్తున్న కవితను చూస్తే దయ్యాలు వేదాలు వల్లిస్తున్నట్లు ఉందని మహేశ్‌కుమార్ గౌడ్ పేర్కొన్నారు.

నఫ్రత్ చోడో.. నిజామాబాద్ జోడో..

కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు నఫ్రత్ చోడో.. నిజామాబాద్ జోడో.. అని ఐకమత్యంగా ఉండి స్థానిక ఎన్నికల్లో వందశాతం విజయం సాధించాలని రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ పిలుపునిచ్చారు. స్థానిక ఎన్నికల్లో బీజేపీ, బీఆర్ఎస్‌లను ఓడించాలని పిలుపునిచ్చారు. మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, భూపతిరెడ్డి, సంజయ్‌కుమార్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, వేదికపై దీపా దాస్ మున్షి, జూపల్లి కృష్ణారావు

ఆర్టీసీ డీఎంపై చర్యలు తీసుకోవాలి

కామారెడ్డి ప్రజా సంఘాల నేతల డిమాండ్

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : అక్రమాలకు పాల్పడుతున్న కామారెడ్డి ఆర్టీసీ డిపో మేనేజర్‌పై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కామారెడ్డి ప్రజా సంఘాల నేతలు, సీనియర్ న్యాయవాదులు వీఎల్ నర్సింహారెడ్డి, జి.జగన్నాథం, క్యాతం సిద్దరాములు డిమాండ్ చేశారు. ఇటీవల భిక్కనూరులోని ఆర్టీసీ పెట్రోల్ బంకులో ట్యాంకర్ డ్రైవర్ నిర్లక్ష్యం వల్ల జరిగిన పొరపాటును అక్కడ పనిచేస్తున్న ఉద్యోగిపై నెట్టి బలి చేసేందుకు ఆర్టీసీ అధికారులు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఈ విషయంలో విచారణ అధికారులు ఇచ్చిన నివేదికను తారుమారు చేసే కుట్ర జరుగుతున్నట్టు కార్మికుల ద్వారా తెలిసిందని, దీనిపై ఉన్నతాధికారులు స్పందించాలని కోరారు.

కామారెడ్డి డిపో మేనేజర్ కార్మికులను దూషిస్తున్నారని, ప్రమోషన్ పొందిన కార్మికులతో డిపో కార్యాలయానికి కావలసిన కుర్చీలు కొనిపిస్తున్నారని, బోర్ రిపేర్ ఖర్చులను ఉద్యోగుల నుంచి వసూలు చేస్తున్నారని, ప్రొజెక్టర్ కెమెరా వంటివి కొనుగోలు చేయించారని, కొనివ్వని కార్మికులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. కార్మికులను వేధింపులకు గురిచేయడం, అవినీతి, అక్రమాలపై ఆర్టీసీ ఎండీకి ఫిర్యాదు చేసి మూడు నెలలు గడిచినా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడాన్ని ప్రశ్నించారు. కార్మికులు, కింది స్థాయి ఉద్యోగులను చిన్నచిన్న విషయాలకే డిపో స్పేర్‌లో పెట్టి ఆఘమేఘాల మీద విచారణ జరిపి చర్యలు తీసుకునే యాజమాన్యం.. అధికారుల అవినీతి, అక్రమాలపై ఫిర్యాదులు చేస్తే ఎందుకు చర్యలు తీసుకోవడం లేదో చెప్పాలన్నారు. అవినీతి, అక్రమాలకు పాల్పడిన అధికారిపై చర్యలు తీసుకోకపోతే చట్టపరంగా ముందుకు వెళ్తామని మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

క్లుప్తంగా

162 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

కామారెడ్డి క్రైం: జిల్లా కేంద్రంలోని ఓ రైస్‌మిల్లు నుంచి తరలించేందుకు సిద్ధంగా ఉంచిన 162 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మంగళవారం ఉదయం పట్టుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పోలీసులతో కలిసి దేవునిపల్లి పరిధిలో ఉన్న సాయి శ్రీనివాస ట్రేడింగ్ మిల్లులో దాడులు చేపట్టారు. అక్కడ నుంచి అక్రమంగా తరలించేందుకు సిద్ధం చేసి ఉంచిన ఓ డీసీఎం వాహనాన్ని గుర్తించి పట్టుకున్నారు. అందులో మొత్తం 277 బస్తాల్లో నింపి ఉంచిన రేషన్(పీడీఎస్)బియ్యంను గుర్తించి సివిల్ సప్లై అధికారులకు సమాచారం ఇచ్చారు. సివిల్ సప్లై డిప్యూటీ తహసీల్దార్ కిష్టయ్య విచారణ జరిపారు. బియ్యం స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని దేవునిపల్లి ఎస్సై రాజు తెలిపారు.

బస్సు నుంచి పడి ఒకరికి గాయాలు

వర్ని: మండల కేంద్రంలో ప్రయాణిస్తున్న ఆర్టీసీ బస్సులో నుంచి ఓ పడి వ్యక్తి పడి తీవ్రంగా గాయపడినట్లు ఎస్సై రమేష్ తెలిపారు. మంగళవారం సాయంత్రం వర్ని నుంచి పాత వర్ని మీదుగా బోధన్ వెళ్తున్న బస్సు నుంచి ఆఫాదిఫారం గ్రామానికి చెందిన పాల్తియా కిషన్ (45)ప్రమాదవశాత్తు రోడ్డుపై పడిపోవడంతో తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో బోధన్ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రికవరీ ఫోన్ల అందజేత



తాడ్వాయి(ఎల్లారెడ్డి): పోగొట్టుకున్న మొబైల్ ఫోన్‌లను సీఈఐఆర్ అప్లికేషన్ ద్వారా గుర్తించి ఆ ఫోన్ల యజమానులకు అందజేసినట్లు ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు. తాడ్వాయి మండల కేంద్రానికి చెందిన కీసరి ప్రవీణ్, లింగంపేట్ మండలంలోని మోతే గ్రామానికి చెందిన ప్రవీణ్ కుమార్ సెల్‌ఫోనులు పోయాయని గతంలో ఫిర్యాదు చేశారు. రికవరీ ఫోన్‌లను మంగళవారం యజమానులకు ఇచ్చారు.

కాంగ్రెస్ సమావేశంలో స్వల్ప ఉద్రిక్తత

- జీవన్‌రెడ్డి, సంజయ్‌కుమార్ వర్గాల మధ్య వాగ్వాదం



నినాదాలు చెయ్యొద్దంటూ తన వర్గాన్ని సముదాయిస్తున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి



డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డితో వాగ్వావాదానికి దిగిన జగిత్యాల కాంగ్రెస్ నాయకులు

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి మండల కేంద్రంలో మంగళవారం జరిగిన కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశంలో స్వల్ప ఉద్రిక్తత చోటు చేసుకుంది. సమావేశం ప్రారంభానికి ముందు ఏఐసీసీ ఆదేశాల మేరకు కార్యక్రమానికి హాజరైన ముఖ్య కార్యకర్తలు గేటు వద్ద ఉన్న రిజిస్టర్‌లో సంతకాలు చేయాలని డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి సూచించారు. దీంతో సంతకాలు చేసేందుకు వెళ్లిన జగిత్యాల నియోజకవర్గం కాంగ్రెస్ నాయకుల జాబితా రిజిస్టర్‌లో లేకపోవడం, ఇటీవలే కాంగ్రెస్ లో చేరిన ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ వర్గీయుల పేర్లు ఉండటంతో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి వర్గీయులు ఆగ్రహానికి లోనయ్యారు. ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ కు వ్యతిరేకంగా నినాదాలు చేయడంతో పాటు మానాల మోహన్‌రెడ్డి పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయమై మానాల మోహన్‌రెడ్డిని నిలదీశారు.

అసహనానికి లోనైన మోహన్‌రెడ్డి తనను ప్రశ్నించడానికి మీరెవరని కార్యకర్తలపై మండిపడ్డారు. కార్యకర్తల నినాదాలతో అక్కడ కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి సైతం తన వర్గీయుల పేర్లు లేకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. కష్టకాలంలో కార్యకర్తలను కాపాడుకుంటూ పార్టీకి సేవ చేస్తున్న తనను కాదని ఎమ్మెల్యే సంజయ్‌ను సమావేశానికి ఎలా పిలుస్తారని మోహన్‌రెడ్డిని ప్రశ్నించారు. ఇతర నాయకులు కలుగచేసుకుని ఇద్దరినీ సముదాయించడంతో వివాదం సద్దుమణిగింది. అయితే సమావేశం ప్రారంభమైన అనంతరం ఎమ్మెల్యే సంజయ్ ప్రసంగిస్తున్న సమయంలో జీవన్‌రెడ్డి వర్గీయులు ఆయనకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో ప్రతిగా సంజయ్ వర్గీయులు నినాదాలు చేయడంతో రాష్ట్ర నాయకులు చేసేది లేక మిన్నకుండిపోయారు. జీవన్‌రెడ్డి ప్రసంగం ప్రారంభించగానే మళ్లీ ఆయన వర్గీయులు కొద్దిసేపు నినాదాలతో హోరెత్తించారు. సమావేశం అనంతరం ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యే సంజయ్ వర్గీయుల మధ్య వాగ్వాదం జరిగింది.

నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం

- ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు

బిచ్కుంద(జుక్కల్): జుక్కల్ నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నా.. ప్రభుత్వం మౌలిక సదుపాయాలు, విద్యా అభివృద్ధి కోసం రూ.వందల కోట్ల నిధులు మంజూరు చేసిందని ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు అన్నారు. మంగళవారం బిచ్కుందలో ఎమ్మెల్యే మాట్లాడారు. ఎన్నికల్లో బిచ్కుందను ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దుతానని మాట ఇచ్చానని, తదనుగుణంగానే రూ.వందల కోట్లు మంజూరు అయ్యాయని తెలిపారు. ఇంటిగ్రేటెడ్ రెసిడెన్సియల్ స్కూల్, పాఠశాలలలో మౌలిక సదుపాయాలు, గదుల నిర్మాణాల కోసం ప్రభుత్వం రూ.327 కోట్ల 74 లక్షలు నిధులు మంజూరు చేసిందన్నారు. అలాగే త్వరలోనే జుక్కల్‌కు కేంద్రీయ విద్యాలయం వస్తుందన్నారు. వీటితో పాటు అదనంగా గ్రామాల్లో రోడ్లు, డ్రైనేజీ ఇతర మౌలిక సదుపాలయ కల్పన కోసం రూ.92 కోట్ల 50 లక్షలు నిధులు ఇచ్చిందని వివరించారు. పీసీసీ డెలిగేట్ విఠల్‌రెడ్డి, నాయకులు గోపాల్‌రెడ్డి, గంగాధర్, వెంకట్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు

నీటి సమస్య పరిష్కారానికి కృషి

నిజాంసాగర్(జుక్కల్): మహమ్మద్‌నగర్ మండలంలోని అవుసుల తండాలో తాగునీటి సమస్యను మంగళవారం జుక్కల్ ఎమ్మెల్యే దృష్టికి మండల కాంగ్రెస్ నాయకులు తీసుకెళ్లారు. ఎమ్మెల్యే స్పందించి తండా ప్రజలకు నీటిఎద్దడి నివారణకు తక్షణమే బోరు వేయించి మోటార్‌ను ఏర్పాటు చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, నాయకులు లోక్యానాయక్, ఆకాష్, గోపిసింగ్, బల్‌రాం తదితరులున్నారు.

సహకార చట్టం-1995పై అవగాహన

లింగంపేట(ఎల్లారెడ్డి): గ్రామ సంఘాల సభ్యులకు సహకార చట్టం మాక్స్ యాక్ట్-1995పై మంగళవారం డీఆర్‌డీవో సురేందర్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా లింగంపేట ఐకేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మండల సమాఖ్య సభ్యుల బైలా శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సంఘాల ఆవశ్యకత, బైలా చట్టం అమలు, మహిళా శక్తి కార్యక్రమాల అమలు, బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి రుణాల గురించి వివరించారు. అలాగే జెడ్పీ సీఈవో చందర్‌నాయక్ మాట్లాడారు. రుణాలు తీసుకున్న సభ్యులు ఆర్థికంగా ఎదిగినప్పుడే మహిళా సాధికారత సాధించినట్లవుతుందన్నారు.



అవగాహన కల్పిస్తున్న డీఆర్‌డీవో సురేందర్

కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షులు సులోచన, ఏపీఎం శ్రీనివాస్, సీసీలు గంగరాజు, శ్రావణ్‌కుమార్, మన్సూర్‌ఖాన్, మేహర్, రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రచార హోరు.. ఫ్లెక్సీల జోరు

- స్థానిక ఎన్నికల దృష్ట్యా ఫ్లెక్సీల ఏర్పాటు

బీబీపేట: రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని నాయకులు ఎప్పటికప్పుడు ఫ్లెక్సీలతో ప్రజలను ఆకట్టుకుంటున్నారు. బీబీపేట మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తాలో ఇప్పటికే పలు పార్టీల నాయకులు భారీ ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి ప్రచారం చేసుకుంటున్నారు. కొద్ది రోజుల్లో నోటిఫికేషన్ వస్తుందని ప్రచారం జోరందుకోవడంతో పార్టీలతో సంబంధం లేకుండా ఇప్పటికే ఫ్లెక్సీలు కట్టి గ్రామాల్లో ప్రచారం చేసుకుంటున్నారు. గ్రామాల్లో ఏ గల్లీలో చూసినా, ఏ మూలన చూసినా ఫ్లెక్సీలే దర్శనం ఇస్తున్నాయి. అంతే కాకుండా మరికొందరు ముందడుగు వేసి సోషల్ మీడియాలో కాబోయే సర్పంచ్ నేనే అంటూ ప్రచారం కూడా మొదలు పెట్టారు.



బీబీపేటలో ప్రధాన చౌరస్తాలో వెలిసిన ఫ్లెక్సీలు

ఇంక్రిమెంట్ సర్క్యులర్ విడుదలపై హర్షం



బాన్సువాడ రూరల్: ఇటీవల రెవెన్యూ శాఖలో వీఆర్‌ఏల నుంచి రికార్డు అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతి పొందిన ఉద్యోగులకు ఇంక్రిమెంట్ సర్క్యులర్ విడుదల కావడంతో వారు హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం వారు బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈసందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ.. రెవెన్యూ ఉద్యోగులు మరింత బాధ్యతగా విధులు నిర్వహించాలని సూచించారు. ఉద్యోగ సంఘాల జేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డి, టీజీఆర్‌ఎస్‌ఏ జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్, నాయబ్ తహసీల్దార్ గంగాప్రసాద్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

దోమకొండ: రాబోవు వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, పారిశుధ్యంపైన దృష్టి పెట్టాలని ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ సూచించారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులతో ఆయన సమావేశం నిర్వహించి మాట్లాడారు. గ్రామాల్లో ఎలాంటి అంటు రోగాలు ప్రబలకుండా చూసుకోవాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. అలాగే ఇంటి పన్నులు 100 శాతం ఈనెల చివరి లోపు వసూలు చేయాలని అన్నారు. సమావేశంలో తహసీల్దార్ సంజయ్‌రావ్ పాల్గొన్నారు.



క్యాలెండర్ల ఆవిష్కరణ

పండిత పరిషత్ క్యాలెండర్..



కామారెడ్డి అర్బన్: రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ తెలంగాణ(ఆర్‌యూపీపీటీ) క్యాలెండర్‌ను మంగళవారం డీఈవో రాజు ఆవిష్కరించారు. కార్యక్రమంలో పండిత పరిషత్ జిల్లా అధ్యక్షుడు అరుణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి అబ్దుల్ రజాక్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు గఫూర్ శిక్షక్, ప్రతినిధులు మధుసూదన్, వంశీధర్, లాల్‌సింగ్, శ్యాంకుమార్ పాల్గొన్నారు.

ఎలక్ట్రిసిటీ 1104 యూనియన్ క్యాలెండర్, డైరీ..



ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి మున్సిపల్ కార్యాలయంలో ఎలక్ట్రిసిటీ 1104 యూనియన్ డైరీలు, క్యాలెండర్లను మున్సిపల్ చైర్మన్ పద్మశ్రీకాంత్ మంగళవారం ఆవిష్కరించారు. యూనియన్ నాయకులు శశికాంత్, సిద్దేందర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్ తదితరులున్నారు.

చైనామాంజా విక్రయిస్తే కఠిన చర్యలు



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): గాలిపటాలకు సంబంధించి చైనా మాంజాను విక్రయిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని డీఎఫ్‌ఆర్‌వో రవికుమార్ సూచించారు. గోపాల్‌పేటలో గాలిపటాలను విక్రయిస్తున్న దుకాణాలను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నిషేధిత చైనామాంజాను విక్రయిస్తే జరిమానా, జైలు శిక్ష తప్పదన్నారు. మనుషులు, పక్షులకు హాని కల్గించే చైనామాంజాను విక్రయించినా, నిల్వ చేసినా చట్టపరమైన చర్యలు తీసుకోవడంతోపాటు దుకాణాలను సీజ్ చేస్తామని చెప్పారు. బీట్ ఆఫీసర్లు నవీన్‌కుమార్, లవణ్‌గౌడ్ ఉన్నారు.

క్రైం కార్నర్

రూ.కోటితో పశువుల వ్యాపారి పరారీ

వర్ని: మండలంలోని పలువురు పాడి రైతులను ఓ పశువుల వ్యాపారి గేదెలను తెచ్చిస్తానని నమ్మించి, రూ.కోటి వరకు వసూలు చేసుకొని పరారైనట్లు బాధిత రైతులు తెలిపారు. వివరాలు ఇలా.. వర్ని మండల కేంద్రానికి చెందిన బాపిరాజు అనే గేదెల వ్యాపారి వర్ని, జాకోర, కోటయ్య క్యాంపు, పొట్టిగుట్ట, అంతపూర్, పాత వర్ని గ్రామాలకు చెందిన రైతుల వద్ద, పాడి రైతుల వద్ద గేదెలు తెచ్చి ఇస్తానని నమ్మబలికి, డబ్బులు వసూలు చేశాడు. సుమారు రూ.కోటి వరకు జమకాగా గత రెండు రోజుల క్రితం కుటుంబంతో సహా గ్రామం వదిలి పరారీ అయినట్లు బాధితులు పేర్కొన్నారు. ఈమేరకు బాధితులు మంగళవారం వర్ని పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. దీంతో వివరాలు సేకరిస్తున్నట్లు వర్ని ఎస్సై రమేష్ తెలిపారు.

గాలిపటాల దుకాణాలపై దాడులు

ఖలీల్‌వాడి: నగరంలోని పలు పతంగుల దుకాణాలపై మంగళవారం టాస్క్‌ఫోర్స్ సిబ్బంది, పోలీసులు దాడులు నిర్వహించారు. ఆయా దుకాణాల్లోని 15 చైనా మాంజా బాబిన్లను స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. వాటి విలువ సుమారు రూ.15వేల వరకు ఉంటుందన్నారు. దుకాణాల యజమానులు అజాంరోడ్డుకు చెందిన ఎండీ ఆశ్రఫ్, మాలపల్లికి హైమద్ అలీలను చర్యల నిమిత్తం రెండో టౌన్ పోలీసులకు అప్పగించినట్లు టాస్క్ ఫోర్స్ సీఐ అంజయ్య తెలిపారు.

డయల్100 దుర్వినియోగం.. ఒకరి బైండోవర్

పెద్దకొడప్‌గల్(జుక్కల్): డయల్100కు కాల్‌చేసి పోలీసుల సమయాన్ని వృథా చేసి, దుర్వినియోగానికి పాల్పడిన ఓ వ్యక్తిని బైండోవర్ చేసినట్లు ఎస్సై మహేందర్ తెలిపారు. మండలంలోని సీతారాంతండాకు చెందిన రాథోడ్‌బాబు కొద్దిరోజుల నుంచి తరుచుగా డయల్100కు కాల్ చేసి మిస్ యూస్ చేస్తున్నాడన్నారు. దీంతో అతడిని పట్టుకొని మొదటి తప్పుగా భావించి, లక్ష రూపాయల పూచీకత్తుపై తహసీల్దార్ దశరత్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్సై తెలిపారు.

అర్ధరాత్రి వరకు షాపు తెరిచిన వ్యక్తికి జైలు

ఖలీల్‌వాడి: నగరంలోని అహ్మద్‌పురా కాలనీలో నిబంధనలకు విరుద్ధంగా అర్ధరాత్రి వరకు కిరాణాషాపు తెరిచిన యాజమాని ఖలీల్‌కు ఒక రోజు జైలు శిక్ష విధించినట్లు ఎస్సై యాసీన్ ఆరాఫత్ మంగళవారం తెలిపారు. దుకాణాలను నిర్ణీత సమయం వరకే తెరిచి ఉంచాలని ఎస్సై తెలిపారు.

దాడి ఘటనలో కేసు నమోదు

ఖలీల్‌వాడి: నగరంలోని అమ్మ వెంచర్ బ్రిడ్జి వద్ద డెలివరీ బాయ్‌పై దాడి జరిగిన ఘటనలో కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీకాంత్ మంగళవారం తెలిపారు. వివరాలు ఇలా.. సోమవారం రాత్రి ఆన్‌లైన్‌లో బిర్యానీ ఆర్డర్ రావడంతో నగరంలోని అహ్మద్‌పుర కాలనీకి చెందిన అబ్దుల్ జునైద్ డెలివరీ చేయడానికి వెళ్లాడు. ఆర్డర్ ఇచ్చిన వారు అంతలోనే క్యాన్సిల్ చేశారు. ఈలోగా జునైద్ డెలివరీ కోసం వెళ్లగా మద్యంమత్తులో ఉన్న వినయ్, శశాంక్, శేక్ రేహాన్, అబ్దుల్ అర్బాజ్, విగ్నేష్ ఆర్డర్ క్యాన్సిల్ విషయంలో అతడితో గొడవపడి, డబ్బులు, ఆర్డర్‌ను లాక్కొని, కొట్టారు. అనంతరం జునైద్ తన ఇద్దరు స్నేహితులను తీసుకొని మళ్లీ వెళ్లగా ఇరువర్గాలు దాడి చేసుకున్నారు. ఈఘటనలో ముగ్గురికి గాయాలు కాగా, ఇరువురు ఒకరిపైఒకరు ఫిర్యాదు చేశారన్నారు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఒకరి ఆత్మహత్య



లద్దాక్ గౌస్ (ఫైల్)

గాంధారి(ఎల్లారెడ్డి): మండల పరిధిలోని ముదెల్లి గ్రామానికి చెందిన లద్దాక్ గౌస్ అలియాస్ బాబు(32) ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై ఆంజనేయులు మంగళవారం తెలిపారు. వివరాలు ఇలా.. గౌస్ బతుకుదెరువు కోసం రెండేళ్ల దుబాయికి వెళ్లి మూడునెలల క్రితం గ్రామానికి వచ్చాడు. అప్పటి నుంచి కుటుంబంలో గొడవలు జరగడంతోపాటు భార్య పుట్టింటికి వెళ్లి పోయింది. దీంతో జీవితంపై విరక్తి చెంది సోమవారం ఉదయం ముదెల్లి పెద్దచెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకొని మృతదేహం కోసం గాలించారు. లభ్యంకాకపోవడంతో మంగళవారం ఉదయం రెస్క్యూ చేసి మృతదేహాన్ని బయటకు తీశారు. కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాన్సువాడ ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు.

మోర్తాడ్‌లో కూలీ..

మోర్తాడ్: మండల కేంద్రంలో గుజరాత్ రాష్ట్రం సూరత్‌కు చెందిన పాటిల్ దీపక్ (30) అనే కూలీ ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై విక్రమ్ తెలిపారు. వివరాలు ఇలా.. దీపక్ మద్యానికి బానిసై భార్యతో తరచు గొడవపడేవాడు. ఈక్రమంలో జీవితంపై విరక్తి చెంది గ్రామంలోని చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

బాలిక ఆత్మహత్యాయత్నం!

- యువకుడి వేధింపులే కారణం?

డొంకేశ్వర్(ఆర్మూర్): మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక (16) ఆత్మహత్యకు యత్నించిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. పదో తరగతి చదువుతున్న సదరు బాలిక మూడు రోజుల క్రితం గడ్డిమందు తాగగా, గమనించిన కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతోంది. అయినప్పటికీ ప్రాణాపాయ స్థితిలో ఉన్నట్లు సమాచారం. ఐతే, బాలిక ఆత్మహత్య యత్నానికి ఓ యువకుడి వేధింపులే కారణమని తెలుస్తోంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు తెలిసింది.

స్నేహితుడినంటూ.. వైద్యం కోసం డబ్బు కావాలంటూ..

- యువకుడిని మోసగించిన సైబర్ మోసగాళ్లు
- రూ.1.63 లక్షలు స్వాహా

ధర్పల్లి: అమాయకులే లక్ష్యంగా సైబర్ నేరగాళ్ల కొత్త ఎత్తుగడలతో మోసాలు చేస్తున్నారు. తన స్నేహితుడినంటూ ఓ యువకుడిని బురిడి కొట్టించి, రూ.1.16 లక్షలు కాజేసిన ఘటన మండలంలో ఆలస్యంగా వెలుగు చూసింది. వివరాలు ఇలా.. మండల కేంద్రానికి చెందిన ప్రశాంత్‌కు నాలుగు రోజుల క్రితం గుర్తుతెలియని నెంబర్ నుంచి ఫోన్ కాల్ వచ్చింది. తన స్నేహితుడు రవి లాగా మాట్లాడి, తనకు ఆరోగ్యం బాగాలేదని, చికిత్స కోసం డబ్బులు కావాలన్నాడు. నమ్మిన ప్రశాంత్ వారు చెప్పిన అకౌంట్ కు రూ.1.63 లక్షలు పంపించాడు. అనంతరం ప్రశాంత్ తన స్నేహితుడైన రవికి ఫోన్ చేసి డబ్బులు వచ్చాయని అడగగా నాకు ఎలాంటి డబ్బులు రాలేవని, నేను ఆరోగ్యంగానే ఉన్నానని స్పష్టం చేశాడు. దీంతో మోసపోయినట్లు గ్రహించిన ప్రశాంత్ పోలీసులను ఆశ్రయించారు. మంగళవారం బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రామకృష్ణ తెలిపారు.

ఆన్‌లైన్ గేమ్‌లో రూ.4.30 లక్షలు మాయం

వేల్పూర్: ఆన్‌లైన్‌లో గేమ్ ఆడుతూ ఒకరు రూ.4.30లక్షలు మోసపోయినట్లు ఎస్సై సంజీవ్ మంగళవారం తెలిపారు. మండల కేంద్రానికి చెందిన ఒకరికి ఫేస్‌బుక్‌లో ఓ లింక్ రాగా ఓపెన్ చేశాడు. అందులో ఆన్‌లైన్ గేమ్ ఆడడం కోసం సహాయం చేస్తామని ఉండటంతో అవతలి వ్యక్తికి మొదట రూ. 1100 ఫోన్‌పే ద్వారా పంపారు. తర్వాత పలు దఫాలుగా అవతలి వ్యక్తికి మొత్తం రూ. 4.30 లక్షలు పంపించారు. అనంతరం అవతలి వ్యక్తి నుంచి స్పందన కరువైంది. దీంతో బాధిత వ్యక్తి డబ్బుల కోసం అవతలి వ్యక్తికి చాలా సార్లు ఫోన్ చేయగా, లిఫ్ట్ చేయకపోవడంతో మోసపోయానని గ్రహించారు. ఈమేరకు బాధిత వ్యక్తి సైబల్ సెల్ పోర్టల్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎస్సై సంజీవ్ తెలిపారు.

మొరం తరలిస్తున్న జేసీబీ సీజ్



ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి శివారులో అక్రమంగా మొరం తవ్వకాలు జరుపుతున్న జేసీబీని సీజ్ చేసినట్లు తహసీల్దార్ మహేందర్‌కుమార్ మంగళవారం తెలిపారు. మున్సిపల్ పరిధిలోని గండిమాసానిపేట శివారులోని ప్రభుత్వ భూమిలో అక్రమంగా మొరం తవ్వకాలు జరుపుతున్న సమాచారం మేరకు అక్కడికి వెళ్లి జేసీబీని సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు తహసీల్దార్ తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి



పెద్దకొడప్‌గల్(జుక్కల్): మండలంలోని ఓ వ్యక్తి ఇటీవల బైక్ అదుపుతప్పి గాయపడగా, ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై మహేందర్ తెలిపారు. వివరాలు ఇలా.. మండలంలోని చావనితండాకు చెందిన మధుసింగ్ (31) కొన్ని రోజుల క్రితం తన బైక్‌పై వెళుతుండగా పంది అడ్డురావడంతో బైక్ అదుపుతప్పి కింద పడిపోయాడు. ఈఘటనలో అతడి తలకు తీవ్రగాయమైంది. వెంటనే కుటుంబ సభ్యులు అతడిని నిజామాబాద్ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ వారం రోజులు చికిత్స అందించగా, బ్రెయిన్ డెడ్‌గా వైద్యులు నిర్ధారించారు. దీంతో అతడిని సోమవారం కుటుంబసభ్యులు ఇంటికి తీసుకురాగా రాత్రి సమయంలో మృతిచెందినట్లు తెలిపారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, పోస్టుమార్టం నిమిత్తం బాన్సువాడ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు.

వాహనాల తనిఖీల్లో డబ్బు పట్టివేత

ధర్పల్లి: వాహనాలు తనిఖీ చేస్తుండగా బైకుపై తరలిస్తున్న ఇద్దరు వ్యక్తుల నుంచి రూ.10.50 లక్షలు పట్టుకున్నట్లు ఎస్సై రామకృష్ణ మంగళవారం తెలిపారు. వివరాలు ఇలా.. మండల కేంద్రం నుంచి దుబ్బాక వెళ్లే రోడ్డు మార్గంలో పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. మండలంలోని వాడీ, సీతాయిపేట్ గ్రామాలకు చెందిన అరుణ్, సాయిలు అనే ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వెళ్తుండగా, వారిని పోలీసులు ఆపి, తనిఖీలు చేశారు. వారి బ్యాగులో నగదు ఉన్నట్లు గుర్తించి, వివరాలు అడిగారు. ఆ నగదును కోరుట్లకు చెందిన శ్రీనివాస్ అనే వ్యక్తి తమకు ఇచ్చినట్లు వారు చెప్పినట్లు ఎస్సై తెలిపారు. పొంతనలేని సమాధానం చెప్పడంతోపాటు ఎటువంటి రసీదులు లేకపోవడంతో నగదును పంచనామా నిర్వహించి, తదుపరి చర్యల నిమిత్తం ఐటీశాఖకు అప్పగించినట్లు తెలిపారు.

డ్రంకన్‌డ్రైవ్ కేసులో పలువురికి జైలు శిక్ష

ఖలీల్‌వాడి: జిల్లాలో ఇటీవల నిర్వహించిన డ్రంకన్‌డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడ్డ పలువురికి స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ జైలు శిక్ష విధించినట్లు ఏసీపీ రాజావెంకట్‌రెడ్డి మంగళవారం తెలిపారు. డిచ్‌పల్లి మండలం మెట్రాజ్‌పల్లికి చెందిన ఇసపల్లి అబ్బయ్యకు ఒక రోజు జైలు శిక్ష, అలాగే శివతండాకు చెందిన కేతవాత్ సంతోష్, ముల్లంగికి చెందిన షేక్ జియోవుద్దీన్, మద్దెపల్లికి చెందిన ఇస్లావత్ శివరాంలకు రెండు రోజుల జైలు శిక్షను జడ్జి విధించినట్లు తెలిపారు. అలాగే పోతంగల్‌కు చెందిన తోకల సంజీవ్, బోధన్‌కు చెందిన బంటు శ్రీనివాస్‌కు రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు చెప్పారు. వీరిని సారంగాపూర్ జైలుకు తరలించినట్లు వివరించారు.

కమ్మర్‌పల్లి: మండల కేంద్రానికి చెందిన టేకు రమేష్ అనే వ్యక్తి మద్యం తాగి వాహనం నడపగా పోలీసులు గుర్తించి కేసు నమోదు చేశారు. నిందితుడిని మంగళవారం ఆర్మూర్ కోర్టులో హాజరుపరుచగా రెండు రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చినట్లు ఎస్సై అనిల్‌రెడ్డి తెలిపారు.

ఖలీల్‌వాడి: డ్రంకన్‌డ్రైవ్‌లో పట్టుబడిన 21 మందికి నగరంలోని ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో కౌన్సిలింగ్ నిర్వహించి మేజిస్ట్రేట్ ముందు హాజరు పర్చినట్లు ట్రాఫిక్ సీఐ ప్రసాద్ మంగళవారం తెలిపారు. వారిలో 19 మందికి సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్‌కు రూ.28,500 జరిమానా విధించగా, ఇద్దరికి జైలు శిక్ష విధించినట్లు తెలిపారు.

సిరికొండ మండలంలో..

సిరికొండ: మండలంలోని చిన్న వాల్గొట్ చౌరస్తా వద్ద మంగళవారం రాత్రి నిర్వహించిన డ్రంకన్‌డ్రైవ్ తనిఖీల్లో నలుగురుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రామ్ తెలిపారు. వాహనాలను తనిఖీ చేస్తున్నప్పుడు పరీక్షలు నిర్వహించగా నలుగురు మద్యం తాగి వాహనాలు నడుపుతున్నట్లు తెలిసిందన్నారు. దీంతో వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.